## క్లుప్తంగా

### సాధన సంకల్ప సభ వాల్‌పోస్టర్ విడుదల



సాధన సంకల్ప సభ వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న దళిత నాయకులు

**పాయకరావుపేట:** దళితవాడ పంచాయతీ సాధన సంకల్ప సభ వాల్‌పోస్టర్లను దళిత నాయకులు బుధవారం విడుదల చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 10న అంబేడ్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి. సునీల్ కుమార్ ముఖ్యఅతిథిగా సభ నిర్వహించనున్నారు. ఈ సభను విజయవంతం చేయాలని దళిత నాయకులు కోరారు. గారా ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ విజయ్ కుమార్ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లంక సూరిబాబు, దళిత నాయకులు పల్లా విలియంకేరి, ఇంజరపు సూరిబాబు, బోడ పాటి శ్రీను, ముక్కుడుపల్లి నాగరాజు, కశిం కోట సత్తిబాబు, ఐ.ఎన్. మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### సచివాలయాల పరిశీలన



గ్రామ సచివాలయాల సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో స్వప్న

**పాయకరావుపేట :** మండలంలోని గ్రామ సచివాలయాలను ఎంపీడీవో కె.స్వప్న పరిశీలించారు. జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ, కులగణన తదితర అంశాలపై సిబ్బంది పని తీరును అడిగి తెలుసుకున్నారు. సత్వరమే ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీచేపట్టాలని, కులగణన సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. సత్యవరం, మాసాహేబుపేట, నామవరం, గుంటపల్లి గ్రామ సచివాలయాలను ఆమె పరిశీలించారు. ఈవోఆర్డీ సీహెచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### మూలపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

**అనకాపల్లి :** గ్రామాలను దశల వారీగా అభివృద్ధి చేస్తామని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో సత్యనారాయణపురం -2 సచివాలయం మూలపేట గ్రామంలో కాలువపై వంతెన, రోడ్డు, కాలువ రక్షణ గోడ నిర్మాణానికి రూ.20 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎక్కడికక్కడ అభివృద్ధి చేస్తామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మరోసారి మనందరి ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ పలక భాగ్యలక్ష్మీ సత్తిబాబు, ఎంపీటీసీ కరిమజ్జి అలివేణి మల్లేశ్వరరావు, పార్టీ గ్రామాధ్యక్షుడు చవ్వాకుల ఈశ్వరరావు, పల్లా ముత్యాలరావు, మజ్జి మహాలక్ష్మీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

**రాంబిల్లి:** అప్పారాయుడుపాలెంలో బుధవారం ఆంజనేయస్వామి తీర్థమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భజనలు, కోలాటాలు, తప్పెటగుళ్లతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# పిల్లల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



నులిపురుగుల నివారణ మాత్రలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ బోదెపుగోవింద్, ఎంపీడీవో అప్పలనాయుడు, ఎంఈవో మీనాక్షి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ మూర్తి

**కోటవురట్ల:** పిల్లల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో డీ వార్మింగ్ డే సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖాధికారులతో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు బుధవారం సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించి, ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ప్రతి చిన్నారితో ఆల్బెండజోల్ మాత్రలు మింగించేందుకు కృషి చేయాలన్నారు. కె.వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న 'నేషనల్ డీ వార్మింగ్ డే' ను విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. మండలంలోని 47 పాఠశాలల్లో 5,850 చిన్నారులతో మాత్రలుమింగించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో గోవిందరావు, అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**నులిపురుగుల నివారణకు కృషి చేయాలి**

**యలమంచిలి:** నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యలమంచిలి మండలం ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. ఈ నెల 9న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల వ్యాప్తంగా విద్యార్థులకు తప్పకుండా నులిపురుగుల నివారణ మాత్రలు అందజేయాలని ఆయన తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ డీవార్మింగ్ డే సందర్భంగా నులిపురుగుల నివారణ అవగాహన కల్పించే పోస్టర్‌ను ఎంపీడీవో అప్పలనాయుడు, మండల విద్యాశాఖాధికారి మీనాక్షి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్‌తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీవీ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మునగపాక:** మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఈనెల 9న నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆమె బుధవారం మండల పరిషత్ హాలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగుల నివారణపై పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి, ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు, ఎంపీడీవో మన్మథరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నులిపురుగుల నివారణకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

**ఎస్.రాయవరం:** చిన్నారులకు విధిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని ఎంపీడీవో సత్యనారాయణమూర్తి తెలిపారు.సర్వసిద్ధి, పెనుగొల్లు పీహెచ్‌సీల పరిధిలో ఈ నెల 9న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాల్‌పోస్టర్‌ను మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్లకు, ఉపాధ్యాయులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. 9వ తేదీన చిన్నారులకు, విద్యార్థులకు ఈ మాత్రలను వైద్య సిబ్బంది పర్యవేక్షణలో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మూర్తి, సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీప్రియ, ఆరోగ్య విస్తరణాధికారులు టి. సత్యనారాయణ, కె.శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



నులిపురుగుల నివారణ మాత్రలను మండల విద్యాశాఖాధికారులకు అందజేస్తున్న యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్

## టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పెదగుమ్ములూరు పాఠశాలలో స్టడీ అవర్స్‌లో చదువుతున్న విద్యార్థులు



కొరుప్రోలులో విద్యార్థి ఇంటికి వెళ్లి చదుతున్న తీరును పరిశీలిస్తున్న హెచ్‌ఎం సత్యనారాయణ

**ఎస్.రాయవరం:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న టెన్త్ విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. టెన్త్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు వీలుగా మండలంలోని పలు పాఠశాలల్లో ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. పాఠశాలలో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నట్టు కొరుప్రోలు హైస్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ చెప్పారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు ఎలా చదువుతున్నారో పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. రాత్రి 10 గంటల వరకు చదివేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఇందుకోసం విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు వెళ్లి పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. విద్యార్థులు టీవీలకు దూరంగా ఉండేలా రాత్రి, తెల్లవారుజామున చదివేలా చూడాలని తల్లిదండ్రులకు సూచించినట్టు ఆయన తెలిపారు.

### 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి



వాడ్రాపల్లిలో మాత్రలు అందజేస్తున్న సర్పంచ్ నూకరాజు

**మునగపాక:** ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. మండలంలోని వాడ్రాపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన 104 శిబిరాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా రోగులకు మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 104 అందుబాటులోకి వచ్చాక గ్రామాల్లో ప్రజలకు సకాలంలో మందులు అందుతున్నాయన్నారు.

## పూడిమడక రోడ్డును పునర్నిర్మించాలి

**మునగపాక:** అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వరకు రోడ్డును పునర్నిర్మించాలని అఖిలపక్ష నేతలు కోరారు. అచ్యుతాపురం నుంచి అనకాపల్లి రోడ్డు పునర్నిర్మాణ సాధన సంఘం ఆధ్వర్యంలో స్థానిక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కన్వీనర్ కాండ్రేగుల సదాశివరావు మాట్లాడుతూ పూడిమడక రోడ్డును బాగు చేసే వరకు ఆందోళనలు చేయాలన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఆళ్ల మహేశ్వరరావు, దొడ్డి శ్రీనివాసరావు, వి.వి. శ్రీనివాసరావు, మొల్లేటి సత్యనారాయణ, టెక్కలి పరశురామ్,నూకప్పారావు,పెంటకోట సత్యనారాయణ, ఆడారి మహేష్ ,కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### అచ్యుతాపురం స్టేషన్‌లో 32 ద్విచక్రవాహనాలు

**అచ్యుతాపురం:** స్థానిక పోలీస్‌స్టేషన్‌లో 32 ద్విచక్ర వాహనాలున్నాయని సీఐ బుచ్చిరాజు తెలిపారు. అనధికారికంగా పార్క్ చేసిన, రోడ్డు పక్కన వదిలేసిన వాహనాలను గుర్తించి స్టేషన్‌కు తరలించినట్టు తెలిపారు. ఈ పరిసర ప్రాంతాల్లో ఎవరివైనా ద్విచక్ర వాహనాలు చోరీకి గురైతే స్టేషన్‌కు వచ్చి సరిచూసుకోవచ్చని తెలిపారు. రోడ్డు పక్కన రోజుల తరబడి వాహనాలను వదిలి వేయవద్దని ఆయన సూచించారు. ట్రాఫిక్ సమస్య పెరిగిపోతున్నందున వాహనాలను పార్కింగ్ చేసే విషయంలో జాగ్రత్తలు, నిబంధనలు పాటించాలని సూచించారు.

## దట్టంగా పొగమంచు



యలమంచిలి రైల్వేస్టేషన్ సమీపంలో దట్టంగా కురుస్తున్న పొగమంచు



మునగపాకలో కురుస్తున్న పొగమంచు

**యలమంచిలి రూరల్/ మునగపాక:** నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బుధవారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 9 గంటలైనా మంచు తెరలు వీడలేదు. ఉదయం పనులకు వెళ్లే రైతులు, కూలీలు, కూరగాయల విక్రయదారులు, ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణం సాగించారు. అయినా ముందున్న వాహనాలు కనిపించక తీవ్ర అవస్థలకు గురయ్యారు. దట్టంగా కమ్మేస్తున్న పొగమంచు కారణంగా మామిడిపూతకు నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### రమాబాయికి ఘన నివాళి



రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

**ఎస్.రాయవరం:** డీహెచ్ అగ్రహారం పాఠశాలలో రమాబాయి 126వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు.రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎస్.వి.రమణ మాట్లాడుతూ రమాబాయి పిడకలు అమ్మి ఆ డబ్బును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చదువు పంపేవారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గారా ప్రకాష్, లలితాంబ, కుసుమ కుమారి, బి.శ్రీను, కృష్ణవేణి, విమల తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచి దైవభక్తి పెంచుకోవాలి

**అనకాపల్లి:** విద్యార్థులు దైవభక్తిని పెంపొందించుకోవాలని భారత్ వికాస్ పరిషత్ పట్టణ అధ్యక్షుడు ఆళ్ల ఓంరామ్, కన్వీనర్ వై.కేశవరావు సూచించారు. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. వికాస్ సప్తాహ్‌లో భాగంగా మెయిన్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో అన్నమయ్య సంకీర్తనల ఆలాపన పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీల్లో ప్రథమ బహుమతిని ఎం.వి.హర్షిణి, ద్వితీయ బహుమతిని ఎం.భాస్య, తృతీయ బహుమతిని ఐ.భావనా రుషికుమార్ గెలుచుకున్నారు. మరో ముగ్గురు విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పరిషత్ కో కన్వీనర్ చదరం కోటేశ్వరరావు, ప్రోగ్రాం కన్వీనర్ సాన త్రినాథ్‌రావు, పరిషత్ కార్యదర్శి ఎన్.ఎ.బి.వర్మ, కోశాధికారి డి.శివరాము పాల్గొన్నారు.



అన్నమయ్య కీర్తనల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో పరిషత్ అధ్యక్షుడు ఆళ్ల ఓంరామ్

## నేటి నుంచి యోగాలో శిక్షణ

**అనకాపల్లి :** స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకూ ఉదయం, సాయంత్రం వేళల్లో భారత స్వాభిమాన ట్రస్ట్ ఆధ్వర్యంలో యోగ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమనాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖ జిల్లా మహిళా పతంజలి యోగ అధ్యక్షులు, యోగా నిపుణులు ప్రభా సాహో విచ్చేస్తారని తెలిపారు. చక్కటి ఆరోగ్యానికి అందరం ప్రతిరోజు యోగా చేయాలని దొరమనాయుడు పేర్కొన్నారు.

## తపాలాబీమాను సద్వినియోగం చేసుకోవాలి



గ్రామస్తులకు అవగాహనకల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ జగదీష్ కుమార్

**నక్కపల్లి:**తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తపాలా బీమాను సద్వినియోగం చేసుకోవాలని యలమంచిలి డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ జగదీష్‌కుమార్ కోరారు. బుధవారం ఆయన దేవవరంలో గ్రామస్తులకు తపాలా శాఖ సేవలపై అవగాహన కల్పించారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్‌వచ్చే పథకాల గురించి వివరించారు. కేంద్ర ప్రభుత్వం తపాలా బీమా పాలసీదారులకు భద్రత కల్పిస్తుందన్నారు. తపాలా శాఖ ద్వారా ప్రజలకు ఉచితంగా పలు సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో సర్పంచ్ గొర్ల రాఘవకుమారి,వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్ల నర్సింహమూర్తి, పెదరాము, పోస్టల్ సిబ్బంది శ్రీనివాస్, సత్తార్ దిలీప్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో జిల్లా నేతల భేటీ





ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు నియోజకవర్గ విశేషాలను వివరిస్తున్న బొడ్డేడ ప్రసాద్, కంబాల జోగులు

**మునగపాక:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట సమన్వయ కర్త కంబాల జోగులు వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అసెంబ్లీలోని సీఎం చాంబర్ వద్ద జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కొంతసేపు జిల్లాకు సంబంధించిన పార్టీ వ్యవహారాలపై మాట్లాడినట్టు ప్రసాద్ తెలిపారు. కంబాల జోగులు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, సమస్యలను వివరించారు.

## ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

- మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి
- యలమంచిలి ఎస్సీ కాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం



జగనన్నఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి

**యలమంచిలి:** పేద ప్రజలందరికీ ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్నారని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. యలమంచిలి మున్సిపాలిటీలోని ఎస్సీ కాలనీ 2 సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె సందర్శించారు. వైద్య శిబిరానికి వచ్చిన వృద్ధులు,మహిళలతో ఆమె మాట్లాడి, వైద్య సేవల గురించి ఆరా తీశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు, మేనేజరు ప్రభాకరరావు,మున్సిపల్ కో ఆప్షన్ సభ్యురాలు షేక్ సయ్యిద్‌బీబీ, కౌన్సిలర్ ఓగి బోయిన చిరంజీవి పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గడపగడపకు అభివృద్ధి



నాగులాపల్లిలో రహదారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ చినమ్మలు, వైస్ ఎంపీపీ దేవి

**మునగపాక:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గడపగడపకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు చేరాయని నాగులాపల్లి సర్పంచ్ జామి చినమ్మలు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో నాగులాపల్లిలోని టీచర్స్ కాలనీ, మునసబు వీధిలో నూతన రహదారుల నిర్మాణానికి వైస్ ఎంపీపీ చిందాడ దేవితో కలిసి ఆమె బుధవారం భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాగులాపల్లిలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్, పీఎంసీ చైర్మన్ మళ్ల బాపునాయుడు,పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్‌తో స్థిరమైన ఆదాయం



రాజుపేటలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**కోటవురట్ల:** ఆయిల్‌పామ్‌తో రైతుకు స్థిరమైన ఆదాయం సమకూరుతోందని పతంజలి కంపెనీ మేనేజర్ తోట చంద్రశేఖర్ అన్నారు. రాజుపేటలో బుధవారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ఎన్నో రాయితీలు కల్పిస్తూ ప్రోత్సహిస్తోందన్నారు. ఒకసారి మొక్క నాటాక మూడేళ్లలో కాపునకు వస్తుందని, ప్రతి నెలా కచ్చితమైన ఆదాయాన్ని పొందవచ్చన్నారు. మొక్కలను రాయితీపై అందించడమే కాకుండా వాటి పెంపకాన్ని ప్రోత్సహిస్తూ నిధులు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.వి.రమణ, ఉద్యానవనశాఖాధికారులు, రైతులు పాల్గొన్నారు.

## టిడ్కో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



లబ్ధిదారులకు పత్రాలను అందిస్తున్న మలసాల భరత్‌కుమార్



సమావేశానికి హాజరైన లబ్ధిదారులు

**అనకాపల్లి:** పేదల సొంతింటి కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలోనే నెరవేరుతోందని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ అన్నారు. స్థానిక 84వ వార్డు కోట్నివీధి కల్యాణ మండపంలో 10,11,12 సచివాలయాల పరిధిలో 300 మంది టిడ్కో గృహాల లబ్ధిదారులకు బుధవారం రిజిస్ట్రేషన్ పత్రాలను, తాళం కప్పలను బుధవారం ఆయన పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ స్థలంలో గృహాలు నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. పట్టణ, మండల పరిధిలో సుమారుగా 5వేల మందికి టిడ్కో గృహాలను అందజేస్తున్నట్లు చెప్పారు. గృహాల్లో నివసించే వారికి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నాయకులు ఏడువాకల నారాయణరావు, డాక్టర్ యశ్వంత్, మలసాల కుమార్ రాజా, ఉగ్గిన అప్పారావు, కోట్ని శ్రీనివాసరావు, కోరుకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం

**రోలుగుంట:** బండి ప్రభ ప్రతిష్ఠతో నాలుగు రోజుల పాటు నిర్వహించే గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు బుధవారం రోలుగుంటలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు యువకులు పగటి వేషాలను ప్రదర్శించారు. సాయంత్రం వెదురు కలపతో సిద్ధం చేసిన 90 అడుగుల నిడివి గల బండి ప్రభను పోలిరెడ్డి నర్సింహమూర్తి ఇంటి వద్ద నుంచి మున్సిబ్ వర్గీయులు భుజాల మీద తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. అదే సమయంలో ఇక్కడ భజనలు, కోలాటాల ప్రదర్శనలతో సందడి సంతరించుకుంది. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ పోతల లక్ష్మీశ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ ఇలవేల్పు ఉత్సవాన్ని బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు.